# గాజులజత

శ్రీమతి సమయమంత్రి వందేమాతరంగారు

వాల్కుర్చీలో కూర్చుని వార్తాపత్రిక చూచుకొంటున్నాడు ప్రసాద్. 'ఈపండుగకేనా గాజులు చేయించరా?' అంటూ పైట సవరించుకొంటూవచ్చి సమీపంగావున్న కుర్చీలో కూర్చుంది లక్ష్మి. ప్రసాదు తన ధోరణిలోనే యున్నాడు.

మిమ్మల్నే మాట్లాడరేం.

ఓహో! యెప్పుడు దయచేశారేమిటి రాణీగారు? అంటూ పత్రిక టేబుల్‌పై నుంచాడు.

'తెలియనట్లు నటించడం బాగానేర్చారు'.

'నీవువచ్చిన సంగతేమిటో చెప్పు'.

'ఈపండుక్కేనా చేయించరూ?'

'ఏపండుగ? ఏంచేయించాలి?'

'సంవత్సరాది! గాజులు చేయిస్తానని మీరే కాదూ అన్నారు'.

'నే చెప్పినమాటవింటే చేయిస్తా' నన్నా.

'అరవైయ్యేళ్ళొచ్చాక చదువుకోక మన్నుకొట్టుకోనా' అని యిక నాకేంచదువు'.

'నీవడిగిందికూడా అంతే అనుకో'.

'ఈ చదువుగోలతో చచ్చేయోగ మొచ్చింది' అని సణుక్కుంటూ వెళ్లింది. ప్రసాదు పురమందిరంకు వెళ్ళాడు.

'లక్ష్మి వంటయిందా? త్వరగా వెళ్లాలి వడ్డించు'.

'కంచంపెట్టుకోండి వడ్డిస్తా'.

'వెండికూడా ముట్టుకోని విధవాచారం యెవరునేర్పారు?'

'ఈ ఒకరోజేకదా నేముట్టుకోను. తిడితే యేలా చెప్పండి'.

'ఏం యివాళ ముట్టుకుంటే'.

'సంతతిశుక్రవారం నోము. యిక ఒక యేడేవుంది. యీమాటు మాఅమ్మగారింటికి వెళ్లినప్పుడు వుద్యాపనచేసుకుంటా లెండి.'

'కాస్త అక్షరంముక్క వచ్చుంటే యీ పిచ్చివేషా లుండకపోను'.

'ఇక మొదలు మాట్లాడితే చదువుచదువో అన్నమాటే కదా'.

'నీకేంబాధ? నామాట నీచెవి కెక్క నీయవుకా!!'

'చదువురాకుంటే? సంసారనిర్వహణాన్కి యేమన్నాలోటా?'

'లోటుకాదూ! రూపాయి చిల్లరతీసుకో వలసినచోట రెండవకాలు తక్కువగా తీసుకొంటావు. చాకలి ప్రతీమాటు బట్టలు పారవేయడం. నీవు తెలుసుకొనుటలేదు. లక్ష్మి, నీకిదేచెప్పడం చదువునేర్చుకొనకుంటే నీతో మాట్లాడను తెలిసిందా.'

'టౌనుహాలునుంచి వచ్చేవరకూ మాట్లాడరుకాదూ?'

'నీవువిద్య నభ్యసించేవరకూ!'

'నిజంగా? యీలాచూడండి నావైపు.'

'కోటుచిరిగి పోతుంది వదులు.'

లక్ష్మిఅంటే పంచప్రాణాలు ప్రసాదుకు. కాని చదువుకోమని యెన్నివిధాల చెప్పినా వింది కాదు. చదువుట నేర్చుకొంటే నీవడిగిన

వల్లా చేయిస్తాసన్నాడు. ససేమిరా అంది. లక్ష్మితో మాట్లాడ్డం మానేసి చూదామను కున్నాడు. తమాషాకన్నా డనుకుంది లక్ష్మి. అంతప్రేమగా ప్రవర్తించే భర్తతో పలకడం మానేస్తాడని కల్లోకూడా అనుకోలేదా వెర్రి బాగులపిల్ల !! భార్యాభర్తల కిరువురకూ వాగ్వాదం జరిగిననాటినుండీ లక్ష్మితో పలుకుట మానినాడు. అనేకవిధాల భర్తను పలుకరించి చూచింది లక్ష్మి. జవాబియ్య లేదు ప్రసాదు. లక్ష్మికూడా అతన్ని పలకరించటం విరమించుకుంది. చెల్లెల్ని చూచి వెళ్ళటానికి వాళ్ళన్నయ్య వొచ్చాడు. సంగతి సందర్భాలన్నీ గ్రహించాడు. వెళ్ళి తండ్రిచెవులో వూదాడీ సంగతి. కుమార్తె బాగోగులుచూచే నిమిత్తం ఆయనవచ్చారు. కూతుర్ని సంగతేమిటని యెన్నివిధాలడిగినా తగిన సమాధానం రాలేదు. అమ్మాయిని తీసుకువెళ్ళాలని వున్నదని తనయుద్దేశ మల్లునకు తెలియపర్చారాయన. తన అభ్యంతరం లేదన్నా డల్లుడు. రావలసినదని కుమార్తెను కోరుకున్నారు. యెంతమాత్రం రావీలులేదని చెప్పేసింది నిర్మొగమాటంగా. వీళ్ళిద్దరిలో యేదో గొప్పరహస్యమిమిడి వుందనుకున్నా డాయన: వచ్చిన దారినే చక్కా వెళ్లారు. ప్రక్కయింటియిందిరతో పరిచయమయింది లక్ష్మికి. క్రమేణా వాళ్ళస్నేహం వృద్ధయింది. గృహకృత్యాలు పూర్తిఅయినవంటే యిరువురూ ఒకచోటనే వుండేవారు. యిందిర విద్యావతియని లక్ష్మి గ్రహించింది. లక్ష్మి పరిస్థితులన్నీ గ్రహించింది యిందిర; లక్ష్మిని విద్యాసంపన్నురాలినిగా చేయాలని సంకల్పించింది. యిందిర అప్పుడప్పుడు గృహలక్ష్మి తెచ్చి చదివివినిపించేది. స్త్రీలకిది ముఖ్యమైన పత్రిక అనికూడా తెలియజేసింది.

లక్ష్మి—నీవునాకు చదవటం నేర్పావంటే నేను తప్పక గృహలక్ష్మి తెప్పించుకుంటా ఇందిరా.

'అదెంతసేపు నిమిషం. కాని నే నడిగిన దానికి తగిన సమాధానమియ్యి లక్ష్మి'

'నీవడగటం, నే చెప్పకపోవటంకూడానా'

'నాతో చెప్పకుండా యేదో గొప్ప రహస్యం దాస్తున్నావు కాదూ?' (అంది నవ్వుతూ.)

'నీతో చెప్పకూడని రహస్యము నాకు' అంది తలవంచి.

'దాచటంలేదని ఒట్టేయి చూదాం!'

'ఒట్టేమిటి నీ ముఖం. లేదని మాటంటే చాలదూ.'

'నీ సంగతంతా నే కనిపెట్టాను. నీ వేమేనా చెపుతావేమోనని చూచా.'

'అయితే యెప్పటినుంచి చదువు ప్రారంభిస్తావు?'

'నా చదువువిషయంతో కొంతకాలం నీ విక్కడే వుండవలసివస్తుందేమో? అందుకు మీవారేమనా అంటారేమో యిందిరా?'

'అలాటి వేమీ లేకుండా నే చూచుకుంటాకా! నీవు చదుకోవాలికాని వారిచే నే చివాట్లు తిన్నా నాకు చింతలేదు.'

'నీఋణం నే తీర్చుకోలే నిందిరా నిజంగా.'

'గురుదక్షిణ సమర్పించుకుందువుగాని లే. వంటవేళవుతోంది నే వెళతానింక.'

## 3

లక్ష్మి విద్యాపరిపూర్ణురా లయింది. పురాణగ్రంథములు చదివి వాటి మంచి చెడ్డలు గ్రహించే శక్తి అలవడింది. క్రొద్దో గొప్పో ఆంగ్లమూ హిందీకూడా చదువుట వ్రాయుటా నేర్పింది ఇందిర. ఒకరోజు మధ్యాహ్నం నిలువుటద్దానికెదురుగా నిలబడి జెడవేసుకుంటోంది లక్ష్మి. చడీచప్పుడూ లేకుండా వచ్చి లక్ష్మి కళ్లు మూసింది యిందిర.

లక్ష్మి—ఇందిరా,నాజెడ బాగారాలేదు. నీవ్వేద్దూ. కళ్లమీద చేతులు జెడమీదకు రానీయి.

'ఇక్కడ వుక్కగావుంది. పంచలోకి రా, అక్కడ వేస్తా.'

మాటలసందర్భాన్ని యీలాఅంది యిందిర లక్ష్మితో.

'లక్ష్మి యిప్పటికేనా...'అని నవ్వుతూ. లేదన్నట్లు తలూపింది లక్ష్మి.

'ఛా నిజంగా.!!'

'అబద్ధమా నీతో యిందిరా.'

'ఏలావున్నావు యిన్నిరోజులు మాట్లాడకుండా? పోనీ నీవేనా మాట్లాడించి చూడక పోయినావా వేరే యేమేనా...'

'ఆలాటి స్వభావంకాదు వారిది. చాలా మంచివారు.'

'ఏం మంచో? యింతకాలం నీవు కనుక సరిపోయింది. మరొకరయితేనా?'

'ఎవరైనా సహించవలసిందే. మొదటి నుంచీ యీలాటి స్వభావమైన మనిషైతే నాకీ చింతలేకపోను యిందిరా.'

'విచారించకు. నీకంటె అతను చాలా బాధపడుతూవుంటాడు.'

'విశేషాలేమేనావుంటే రేపు చెప్పుకో వచ్చు.నే వెళ్తా లక్ష్మి.'

గృహకృత్యాలు పూర్తిచేసుకొని తన గది చేరుకుంది లక్ష్మి; మామూలుగా గ్రంథకాలక్షేపణ ప్రారంభించింది. చదువుకొనుచున్న ప్రసాదు, లక్ష్మి గదిలో కెళ్లడం చూచాడు. నెమ్మదిగా లక్ష్మిగదిలో ప్రవేశించాడు. లక్ష్మి గ్రహించలేదు. లక్ష్మి పరున్న రత్నకంబళంమీదే ఆమెప్రక్కగా కూర్చున్నాడు. ప్రసాదుని చూచి లక్ష్మి లేచి నిలబడింది.

'విద్యావతివగు నినుగాంచి ధన్యుణ్ణయినా లక్ష్మి. ఇలా నా సమీపంగా కూర్చో. ఇంతకాలంనుంచీ నా ప్రవర్తనకు నీ వెంత చింతిలుచున్నావో. నీ విద్యావిషయంలో నే నే నింత కఠిన మూనవలసివచ్చింది. మరోలా గనుకోకు. ఇదిగో నీవు కోరిన గాజుల జత.'

'మీ దయవల్ల హస్తముల కలంకార మేదో గ్రహించాను. మీ వప్పుదలమీద అవి గురుదక్షిణగా యిందిరకు యీయ దలచాను.'

'సదుద్దేశముల కెప్పుడూ ఆటంకపరచను. ఈ గాజులజతమూలాన్నే నీవు విద్యావతి వయావు కనుక యివి నీకే చెందవలసుంది. ఆమెకు మరొకజత సమర్పించుదువు గాని.'

'అంతవరకూ వీటిని నేను ధరింపను. ఇం కొక్క కోరిక మిమ్ము కోరదలచాను.'

'అదేమో అడుగు చూదాం.'

'ఇకమీద మీ రేలా నడుచుకోమంటే ఆలా నడుచుకుంటా. ఇంత కఠినయాత్ర యెప్పుడూ వహించకండి నే సహించలేను.' అంటూ కాళ్లమీద పడింది. లక్ష్మిని లేవ దీసి హృదయాని కదుముకున్నాడు ప్రసాదు.

లక్ష్మి యిందిరకు సమర్పించిన గురు దక్షిణ లక్ష్మికే చేరింది. లక్ష్మి తెలివితేట లకు మెచ్చి యిందిర మరల యిచ్చివేసింది. లక్ష్మి అడుగకపోయినా ప్రతిపండుగకూ నూతనవస్తువు తెస్తూనేయున్నాడు ప్రసాదు. ఆ ప్రేమైకదంపతులు హాయిగా కాలం గడుపుతున్నారు. ఇందిర రోజు కొకమారు వచ్చిపోతూనేయుంది.

# సాధ్వి

బయ్యా సూర్యనారాయణమూర్తి గారు

కల్లకపటము లెఱుఁగక ♦ నెల్లవేళ
లందుఁ బ్రాణేశు చరణార ♦ విందయుగళ
భజన సంజనితానంద ♦ భరితచిత్త
వంచు నీముఖాబ్జము వచి ♦ యించునమ్మ.
ప్రవిమలంబై ప్రశాంతమై ♦ భవ్యమంద
హాసచంద్రికా శోభితం ♦ బై చెలంగు
నీదు నెమ్మోముగన్గొన్న ♦ నిఖిలఘోర
పాపములుగూడ తృటిలోన ♦ బాయునమ్మ
ఘనతరాభీల చలదూర్మి ♦ కావితాన
భరితమైనట్టి సంసార ♦ వారిరాశి
పలువిధంబుల జలకేళి ♦ సలుపవలను
గలుఁగు కొలనొను నీనేర్పు ♦ కలిమిబలిమి.

నీవు మసలెడు తావుల ♦ లోవిచార
దుఃఖభయగర్వనైస్పృహా ♦ దులకు నిలువ
నీడయైనను లభియింప ♦ నేరదమ్మ
పూతభావంబులే నీకు ♦ భూషలాట.
ఎపుడు నిద్దురవోవుదు ♦ వెపుడు లేతు
వింటిపనులెల్లఁ జక్కగా ♦ నెపుడుదిద్దు
దాగతాతిథినికరంబు ♦ నాదరింతు
వెప్పు డెంతయు చిత్రమా ♦ నెంచిచూడ.
మంచిసుంతైన లేనట్టి ♦ మనుజుఁడేని
నిన్నుఁగాంచిన యంతనె ♦ నిరుపమాన
భక్తి కేల్మోడ్చి నీపాద ♦ పంకజముల
కెఱఁగు నిదియెట్టి శక్తియో ♦ యెఱుఁగనమ్మ